ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
శనివారం 14 డిసెంబరు 2024



న్యూస్ బాక్స్

పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక

పెద్దపల్లి, డిసెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయ్యింది. ఈమేరకు పెద్దపల్లిలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశంలో అధ్యక్షుడిగా రంగు రవి, ప్రధానకార్యదర్శిగా కె మనోహర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఖాజా మొహినుద్దీన్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు నామ ప్రవీణ్ రావు హాజరయ్యారు.

నేడు జిల్లా స్థాయి జూనియర్ బాలబాలికల కబడ్డీ పోటీలు


పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 13(ఆంధ్ర జ్యోతి): జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మైదానంలో ఈనెల 14న శనివారం కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాలబాలికల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి గుజ్జుల కరుణాకర్‌రెడ్డి తెలిపారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఉదయం 9 గంటలకు ఒరిజినల్ ఆధార్‌కార్డుతో హాజరు కావాలని బాలురు 70కేజీల బరువు, బాలికలు 65 కేజీల బరువు ఉండాలన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఓదెల డిసెంబర్ 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ యాకయ్య తెలిపారు. ఉదయం 10గంటలకు నిర్వహించి నిర్వహించే ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పాల్గొని చెక్కుల అందచేస్తారని తెలిపారు. లబ్ధిదారులు ఆధార్ కార్డులతో హాజరుకావాలని తహసీల్దార్ తెలిపారు.

- బోనస్ కొనసాగిస్తామని ప్రభుత్వ ప్రకటన
- జిల్లాలో లక్ష ఎకరాల్లో సన్న రకం వరి సాగు
- ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీళ్లు ఉండడంతో భరోసా

యాసంగిలోనూ సన్నాల సాగు



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

యాసంగిలోనూ సన్న రకం ధాన్యానికి బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు సన్నాల సాగుపైనే దృష్టి సారించారు. సాగు అంచనాలో సగానికి పైగా సన్న రకం వరి సాగు చేసేందుకు ఇప్పటికే రైతులు నార్లు పోశారు. గడిచిన వానాకాలం సీజన్‌లో సన్న రకం వరి పంట సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్వింటాలు ధాన్యానికి 500 రూపాయల బోనస్ చెల్లిస్తామని ప్రకటించింది. ఆ మేరకు రైతులు రికార్డు స్థాయిలో సన్న రకం వరి సాగు చేశారు. వానాకాలంలో జిల్లా వ్యాప్తంగా 2,09,562 ఎకరాల్లో రైతులు వరి సాగు చేయగా, ఇందులో దొడ్డు రకం వరి 36,676 ఎకరాల్లో సాగు చేయగా, సన్న రకం 1,72,879 ఎకరాల్లో సాగు చేశారు. అంటే 78.79 శాతం సన్న రకం పంటను సాగు చేశారు. ఎక్కువగా బీపీటీ, సాంబమశూరి, జైశ్రీరాం, చిట్టి ముత్యాలు తదితర రకాల వరి ధాన్యాన్ని సాగు చేశారు. ఇప్పటి వరకు రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో 2,45,345 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని విక్రయించారు. ఇందులో దొడ్డు రకం 61,249 టన్నులు కాగా, సన్న ధాన్యం 1,84,096 టన్నులు కావడం గమనార్హం. ఈ ధాన్యానికి ప్రభుత్వం బోనస్ కింద 92 కోట్ల 4 లక్షల 80 వేల రూపాయలు చెల్లించాల్సి ఉన్నది. ఇప్పటి వరకు 18,969 మంది రైతులు విక్రయించిన 1,27,058.8 టన్నుల ధాన్యానికి 63 కోట్ల 52 లక్షల 94 వేల 400 రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేశారు. మిగతా రైతులకు ఖాతాల్లో డబ్బులు జమ కానున్నాయని అధికారులు తెలిపారు. ఇంకా కొనుగోళ్లు సాగుతున్నాయి.



కౌలు రైతులకు కూడా లాభం..

బోనస్ వల్ల భూములు గల రైతులతో పాటు కౌలు రైతులకు కూడా లాభం కలగడంతో ఈ సీజన్‌లో కూడా సన్న రకం వరి సాగు చేస్తున్నారు. ఈ సీజన్‌లో 2 లక్షల 2 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేయనున్నారని వ్యవసాయ శాఖాధికారులు అంచనా వేశారు. ఇందులో ప్రతి ఏటా 30 వేల ఎకరాల్లో రైతులు విత్తనోత్పత్తి కోసం సన్న రకం వరి ధాన్యాన్ని పండిస్తుంటారు. బియ్యం నూక అవుతాయని, తినేందుకు పనికి రావని రైతులు దొడ్డు రకం వరి పంటనే సాగు చేస్తుంటారు. అయితే యాసంగి పంటకు కూడా బోనస్ ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో రైతులు సన్న రకం వరి సాగుపైనే దృష్టి సారించారు. యాసంగి సీజన్‌లో సాగు చేసే సన్న రకం వరి పంటకు బోనస్ ఇవ్వరని భావించిన కొంత మంది రైతులు దొడ్డు రకం వరిని సాగు చేసేందుకు నారుమళ్లను సిద్ధం చేసుకుని విత్తనాలు పోశారు. యాసంగి సీజన్‌కు కూడా బోనస్‌ను కొనసాగిస్తామని సీఎం ప్రకటించడంతో దొడ్డు రకం వరి నార్లు పోసుకున్న కొందరు రైతులు సన్న రకం విత్తనాలను కొనుగోలు చేసి వరి నార్లు పోశారు. విత్తనోత్పత్తి కోసం పండించే సన్న రకం పంట గాకుండా లక్ష ఎకరాల్లో సన్న రకాలు సాగు కావచ్చని వ్యవసాయ శాఖాధికారులు అంచనా

మిగతా 8వ పేజీలో...



గోదావరిఖనిలోని ఓ మినీ ఏటీఎం కేంద్రం

మినీ ఏటీఎం కేంద్రాలే టార్గెట్..

- బిర్యానీ, ఫాస్ట్‌ఫుడ్ ఆర్డర్ల పేర టోకరా
- గోదావరిఖని, పెద్దపల్లిల్లో వరుస ఘటనలు

6


సుల్తానాబాద్‌లోని మినీ స్టేడియం

లక్షలు వెచ్చించారు.. లక్షణంగా వదిలేశారు..

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మినీ స్టేడియం..

8

ఎన్టీపీసీలో ముగిసిన హిందీ ట్రాన్స్‌లేషన్ శిక్షణ


శిక్షణలో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు

జ్యోతినగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రామగుండం ఎన్టీపీసీలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న హిందీ ట్రాన్స్‌లేషన్ శిక్షణా తరగతులు శుక్రవారం ముగిసాయి. సెంట్రల్ ట్రాన్స్‌లేషన్ బ్యూరో ఆధ్వర్యంలో ఈడీసీ మిలీనియం హాలులో తరగతులు జరిగాయి. ఈనెల 9న ఎన్టీపీసీ ఆర్ఈడీ కేదార్ రంజన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. శుక్రవారం జరిగిన ముగింపు కార్యక్రమానికి ఎన్టీపీసీ జీఎం ఎ.కె.త్రిపాఠి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జీఎం ప్రసంగిస్తూ అన్ని ప్రాంతాలను ఒక్కటి చేస్తూ హిందీ మాధ్యమంగా పని చేస్తుందన్నారు. రాజ్‌భాష హిందీని ఎన్టీపీసీలో అధికారిక వ్యవహారాల్లో సమర్థవంతంగా వినియోగిస్తున్నామన్నారు. శిక్షణా కార్యక్రమంలో ఎన్టీపీసీ ఉద్యోగులు, అధికారులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది, బ్యాంకులు, ఇతర కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన


రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : టీఎఫ్ఐడీసీ నిధులతో చేపట్టనున్న రోడ్డు వెడల్పు పనులను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, అధికారులతో కలిసి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణ అభివృద్ధికి నెల రోజుల క్రితం 30 కోట్ల రూపాయలతో పనులకు శంకుస్థాపన చేసుకుని పనులు మొదలు పెట్టడం జరిగిందని, 9 ప్యాకేజీలకు 7 ప్యాకేజీల పనులు మొదలుపెట్టినట్లు తెలిపారు. ఈనెల 4న పెద్దపెల్లి పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపల్లి పట్టణ అభివృద్ధికి 15కోట్ల రూపాయలు మంజూరు చేశారని, అందులో భాగంగా 4 ఎకరాల స్థలంలో నాలుగు కోట్ల రూపాయలతో పార్కు ఏర్పాటు చేయనున్నట్లు, మిగతా 11 కోట్ల రూపాయలతో పట్టణంలోని అన్ని వార్డుల్లో అవసరం ఉన్నచోట సీసీ రోడ్లు, మురికి కాలువలు, ఇతరత్రా పనులను చేయించనున్నట్లు తెలిపారు. పట్టణ అభివృద్ధికి రానున్న ఆరు నెలల్లో మరో 45కోట్ల రూపాయలతో పనులు చేయడానికి అనుమతులు తీసుకున్నామన్నారు. పెద్దపల్లి పట్టణంలోని చాకలి ఐలమ్మ విగ్రహం నుంచి జెండా చౌరస్తా వరకు, జెండా చౌరస్తా నుంచి మజీద్ వరకు, జెండా నుంచి సుభాష్ విగ్రహం వరకు 75లక్షల రూపాయలతో 40ఫీట్లతో బీటీ రోడ్డు పనులను త్వరలోనే మొదలు పెట్టనున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే రోడ్డు వెడల్పు స్థలాలను పరిశీలించినట్లు తెలిపారు. పట్టణ ప్రజలకు అనుకూలంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్లు, మురికి కాలువలు నిర్మిస్తామన్నారు. ఇందుకు పెద్దపల్లి పట్టణ ప్రజలు సహకరించగలరని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నూగిల్ల మల్లన్న, భూతగడ్డ సంపత్, పాగల సోని శ్రీకాంత్, మున్సిపల్ ఏఈ సతీష్ టౌన్ ప్లానింగ్ అధికారి వినయ్, మున్సిపల్ అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులతో డీఎంహెచ్‌వో సమీక్ష

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులతో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి అధ్యక్షతన స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ అన్నా ప్రసన్నకుమారి, మాట్లాడుతూ ఖచ్చితంగా పీసీ అండ్ పీఎన్‌డీటీ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ కలిగి ఉండాలని, ధరల పట్టిక, వైద్యుల పేర్లు, సేవల వివరాలు ప్రజలకు కనపడే విధంగా ప్రదర్శించాలని సూచించారు. రిసెప్షనిస్ట్ మర్యాదపూర్వంగా వ్యవహరించాలని, ధరల, సేవల గురించి వివరంగా స్కానింగ్ కోసం వచ్చే వారికి వివరించాలని, రికార్డులు మెయింటేన్ చేయాలని, సంబంధిత రిపోర్ట్‌ను నెలనెలా తన కార్యాలయంలో ఇవ్వాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయుట చట్టరీత్యా నేరం అని ఆమే పేర్కొన్నారు.

చిల్లపల్లి గ్రామపంచాయతీకి జాతీయ స్థాయి అవార్డు

- అధికారులను అభినందించిన మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిల్లపల్లి గ్రామ పంచాయతీకి మహిళా స్నేహపూర్వక జాతీయ స్థాయి అవార్డు రావడంపై మంత్రి శ్రీధర్‌బాబు హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా అధికారులను అభినందించారు. శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి శ్రీధర్‌బాబును డీపీవో వీరబుచ్చయ్య, డీఎల్‌పీవో కొమ్మెర సతీష్‌కుమార్, మంథని ఎంపీడీవో పూర్ణచందర్, ఎంపీవో శేషయ్య, జూలపల్లి ఎంపీవో అనిల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాంకిషోర్, డీపీఎం రజాక్‌లు మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్రపతి చేతుల మీదుగా స్వీకరించిన అవార్డును మంత్రి శ్రీధర్‌బాబుకు చూపడంతో వారిని అభినందించారు. అభివృద్ధి కార్యక్రమాల్లో అధికారుల కృషి మేరకు మరిన్ని అవార్డులు రావాలని మంత్రి ఆకాక్షించారు.

నేడు జాతీయ మెగా లోక్ అదాలత్

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని కోర్టుల్లో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి హేమంత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో కక్షిదారులు పెద్ద సంఖ్యలో హాజరై తమ కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ఇందులో మోటార్‌వాహన చట్టాలకు సంబంధించిన కేసులు, కుటుంబ తగాదలకు సంబంధించిన, పెన్షన్ కేసులు, పోలీస్ కేసులు, అన్ని రకాల సివిల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంకు కేసులు, విద్యుత్ శాఖకు సంబంధించిన శాఖలు, మున్సిపాలిటీ, రెవెన్యూ ఈపీటీ, తదితర కేసులను రాజీ చేసుకోవాలని తెలిపారు. ఇంతకుముందు కోర్టు వరకు రాని కేసులను కూడా రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో ఇచ్చిన తీర్పులకు ఎటువంటి అప్పీల్ ఉండదన్నారు.

హామీల పేరుతో మంత్రి శ్రీధర్‌బాబు మోసం..

- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

మంథని, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్‌గా 6 గ్యారెంటీ పథకాలు, 420 హామీ పేరుతో ప్రజలను మభ్యపెట్టి మోసం చేసిన మంత్రి శ్రీధర్‌బాబుపై చీటింగ్ కేసు నమోదు చేయాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు డిమాండ్ చేశారు. శుక్రవారం పుట్ట మధు విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ముత్తారంలో జరిగిన కార్యక్రమంలో బెల్ట్‌షాప్‌లను తొలగించాలనే మహిళల అభ్యర్థన మేరకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వచ్చిన వెంటనే తమ అధిష్టానానికి ఈ విషయం చెప్పి బెల్ట్‌షాప్‌లు లేకుండా చేస్తామని, ముత్తారం వేదికగా మహిళలకు ఇచ్చిన వాగ్దానం ఎటు పోయిందని ప్రశ్నించారు. తాము ప్రభుత్వ పనితీరును వైఫల్యాలను ప్రశ్నిస్తే కిందిస్థాయి నాయకులతో దూషించేలా మాట్లాడించడం, తన సామాజికవర్గ నాయకులతోనే తనపై దాడులు చేయించడం సరికాదని, మంథని అభివృద్ధిపై ఆలోచన చేయాలని హితవు పలికారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలో చిన్నకాళేశ్వరం పూర్తిచేస్తామని మాట్లాడిన మంత్రి ఎందుకు పూర్తిచేయించడం లేదన్నారు. అలాగే కిషన్‌రావుపల్లి నుంచి భూపాలపల్లి వరకు రహదారి నిర్మాణం కోసం కేవలం రూ.4కోట్ల నిధులు మంజూరు చేయలేక పోతున్నారని, ఈ రహదారి నిర్మాణంతో భూపాలపల్లి వెళ్లేందుకు దూరభారం తగ్గుతుందన్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిన మంత్రి శ్రీధర్ బాబుపై 420 కేసు నమోదు చేయాలని పోలీసులకు రిజిష్టర్ పోస్టు ద్వారా ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో తగరం శంకర్‌లాల్, ఏగోళపు శంకర్‌గౌడ్, మాచీడి రాజుగౌడ్, కాయితీ సమ్మయ్య, బెల్లకొండ ప్రకాష్‌రెడ్డి, గొబ్బూరి వంశీ, కనవేన శ్రీనివాస్, ఆసీఫ్, కుమార్, ఇర్ఫాన్‌లు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్ష కేంద్రాల వద్ద 163 సెక్షన్ అమలు : సీపీ

కోల్‌సిటీ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో ఈనెల 15, 16 తేదీల్లో నిర్వహించనున్న గ్రూప్-2 పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163బీఎన్ఎస్ఎస్ చట్టం(ఐపీసీ144) అమలులో ఉంటుందని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనరేట్ వ్యాప్తంగా 66పరీక్ష కేంద్రాల్లో 23,969 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారన్నారు. పెద్దపల్లి జిల్లాలో 18పరీక్ష కేంద్రాల్లో 9,018, మంచిర్యాల జిల్లాలో 48పరీక్ష కేంద్రాల్లో 14,951మంది హాజరుకానున్నారన్నారు. డిసెంబర్ 15న ఉదయం 6గంటల నుంచి డిసెంబరు 16 సాయంత్రం 6గంటల వరకు ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. పరీక్ష కేంద్రాలకు 300మీటర్ల దూరంలో గుంపులుగా ఉండరాదని, సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు నిషేధమన్నారు. పరీక్ష సమయాల్లో పరిసరాల్లోని ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ సెంటర్లు, స్టేషనరీ దుకాణాలు మూసివేస్తారన్నారు. ప్రత్యేక పోలీస్ పెట్రోలింగ్ పార్టీలను ఏర్పాటు చేశామని, అవాంచనీయ సంఘటనలు జరుగకుండా గట్టి నిఘా పెట్టామన్నారు. దీనిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పరీక్షల నిర్వహణ ఏర్పాట్లు పూర్తి..

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 పరీక్షకు సంబంధించి జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని పరీక్షల ఏర్పాట్లకు సంబంధించిన టీజీపీఎస్సీ జిల్లా ప్రాంతీయ సెంటర్ సమన్వయ అధికారి డాక్టర్ ఓ. లక్ష్మీనర్సయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 9018మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని, మొత్తం 18పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పెద్దపల్లిలో 9 కేంద్రాలు, సుల్తానాబాద్‌లో 2 జేఎన్టీయూ మంథనిలో 1, గోదావరిఖనిలో 6 సెంటర్లను అందుబాటులో ఉంచామని, పరీక్షలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు.

హైదరాబాద్ వెళుతున్న మెప్మా ఆర్పీల అరెస్ట్

సుల్తానాబాద్, డిసెంబరు 13: (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్ల సాధన కోసం హైదరాబాద్ తరలివెళుతున్న మెప్మా ఆర్పీలను మార్గమధ్యలో పోలీసులు అదుపులోకి తీసుకుని సుల్తానాబాద్ తరలించారు. జిల్లా నుంచి రెండు బస్సులలో హైదరాబాద్ బయలుదేరిన మెప్మా మహిళలను కరీంనగర్ జిల్లా పరిధిలోని రేణిగుంట టోల్ గేట్ వద్ద బస్సులను ఆపి వారిని సుల్తానాబాద్ తరలించారు. రామగుండం, పెద్దపల్లి నియోజకవర్గాలకు చెందిన డెబ్బై ఒక మంది మహిళలు పోలీసులు అదుపులో ఉన్నారు. మరి కొందరిని రాజీవ్ రహదారి రెండో టోల్ గేట్ వద్ద కూడా అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు జిల్లాకు చెందిన అందరినీ సుల్తానాబాద్ పట్టణంలోని వైశ్యా భవన్‌కు తరలించారు. మెప్మా ప్రతినిధుల సంఘం జిల్లా అధ్యక్షురాలు కావూరి శారద, కోశాధికారి బామండ్లపల్లి స్వర్ణలత, పొన్నం రాజకుమారి, షాహిరా సుల్తానా తదితరులు ఉన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

- విద్యార్థుల నమూనాలను తిలకించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష


విద్యార్థుల నమూనాలను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష


విద్యార్థికి బహుమతి అందజేస్తున్న డీఈవో మాధవి

జ్యోతినగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీ టీటీఎస్‌లోని జడ్పీ స్కూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ పెయిర్ ఎగ్జిబిషన్, ఇన్‌స్పైర్ అవార్డుల ప్రదర్శన శుక్రవారం ముగిసింది. 3 రోజులపాటు కొనసాగిన వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లాలోని పాఠశాలకు చెందిన విద్యార్థులు తాము రూపొందించిన నమూనాలను ప్రదర్శించారు. ప్రదర్శన చివరిరోజు కలెక్టర్ కోయ శ్రీహర్ష సందర్శించి విద్యార్థులు రూపొందించిన నమూనాలను ఆసక్తిగా పరిశీలించారు. సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. పాఠశాలల్లో విద్యతోపాటు అవసరమైన వినోదం కూడా ఉండాలని, సైన్స్ ఫెయిర్, పర్యాటక ప్రాంతాలను చూపించడంలాంటి కార్యక్రమాలను చేపట్టడం మంచిదన్నారు. వైజ్ఞానిక ప్రదర్శన చివరిరోజు ఉత్తమ నమూనాలు తయారు చేసిన విద్యార్థులకు డీఈవో మాధవి సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు. జిల్లా సైన్స్ అధికారి రవినందర్‌రావు ఆధ్వర్యంలో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు.

ఎంపికైన ఉత్తమ నమూనాలు..

వైజ్ఞానిక ప్రదర్శనలో ఉత్తమమైన నమూనాలను న్యాయ నిర్ణేతలు ఎంపిక చేశారు. ఇన్‌స్పైర్ విభాగంలో(డీఎల్ఈపీసీ) పి.అభిలాష్(సోలార్‌పవర్డ్ డిసాలినేషన్), పి.జయసింహ, సిహెచ్.చంద్రిక, జె.వర్షిత్, పి.సిరివెన్నెల, వి.మణీశ్వర్, ఆర్.సహర్ష రూపొందించిన మోడళ్లు ఉత్తమ నమూనాలుగా జ్యూరీ సభ్యులు ఎంపిక చేశారు. అలాగే 18 మంది తయారుచేసిన నమూనాలను న్యాయ నిర్ణేతలు ఉత్తమమైనవిగా ఎంపిక చేశారు. త్వరలో నిర్వహించే రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఈ నమూనాలు ఎంపికయ్యాయి.

చట్టాన్ని గౌరవించే వారికే ఫ్రెండ్లీ పోలీసింగ్ : సీపీ



కౌన్సెలింగ్‌లో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్



పాఠశాలను ప్రారంభిస్తున్న సీపీ శ్రీనివాస్

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : చట్టాన్ని గౌరవించే వారికే ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉంటుందని సీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక స్వరూప గార్డెన్లో శుక్రవారం జిల్లాలోని రౌడీషీటర్స్‌లో మార్పు తెచ్చేందుకు బీ బెటర్ లైఫ్ అనే నినాదంతో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రౌడీషీట్‌లో ఉన్నవారు ఎలాంటి కేసుల్లో, గ్రూపు తగాదాల్లో పాలుపంచుకోకూడదని, ఎవరైనా భవిష్యత్తులో నేరాలకు పాల్పడితే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. నేర జీవితం వీడి సమాజంలో మంచి జీవితం గడుపుతూ హుందాగా జీవించాలని తెలిపారు. రౌడీ షీటర్స్ తమ పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని మార్పు తెచ్చుకోవాలని సూచించారు. రౌడీ షీటర్ అనే ఓ పదం తమ బిడ్డల భవిష్యత్ కూడా నాశనం చేస్తుందని గుర్తుచేశారు. రాష్ట్రప్రభుత్వం గంజాయి నిర్మూలన లక్ష్యంగా స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని, దానికి ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా గంజాయి అమ్మినా, కొని సరఫరా చేసినా, అక్రమ రవాణా చేసిన, తాగినా, నిల్వ ఉంచినా, ప్రలోభాలకు గురై భూకబ్జాలు, ప్రజలను భయపెట్టడం, ఆస్తుల ధ్వంసం చేయడం, ఇతర చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడేవారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ చేతన ఐపీఎస్., పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, గోదావరిఖని, పెద్దపల్లి సబ్ డివిజన్ సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు

ఇటుక బట్టీ కార్మికుల పిల్లలకు కార్పొరేట్ విద్య..

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 13 (ఆంధ్ర జ్యోతి): ఇటుక బట్టీల్లో పనిచేసే వలస కార్మికుల పిల్లలకు కార్పొరేట్ విద్య అందించడమే లక్ష్యంగా వర్క్‌సైట్ స్కూల్ పేరుతో పాఠశాలలు ప్రారంభించినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ పేర్కొన్నారు. పెద్దపల్లి జోన్ బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సీపీ ఎం.శ్రీనివాస్ వర్క్‌సైట్ స్కూల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ చేతన, పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, గోదావరిఖని, పెద్దపల్లి సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

శంకరపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలోని మెట్‌పల్లి గ్రామానికి చెందిన క్యాదాసి సంపత్ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. సంపత్ గతనెల 17న తన మోటర్ సైకిల్‌పై ఇంటి నుంచి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల వద్ద ఆరా తీశారు. ఆచూకీ లభించక పోవడంతో సంపత్ భార్య క్యాదాసి స్రవంతి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

గుండెపోటుతో ఒకరి మృతి

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన పెద్దూరి మల్లయ్య (56) అనే రజకుడు దుస్తులు ఇస్త్రీ చేస్తూ శుక్రవారం గుండెపోటుకు గురై మృతి చెందాడు. గ్రామానికి చెందిన మల్లయ్య తన కుల వృత్తిలో భాగంగా స్థానికంగా ఓ డబ్బాను ఏర్పాటు చేసుకొని దుస్తులు ఇస్త్రీ చేసేవాడు. రోజులాగే డబ్బాలో దుస్తులను ఇస్త్రీ చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా ఛాతిలో నొప్పి అంటూ కుప్పకూలి చనిపోయాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రజక సంఘం నాయకులు, స్థానికులు కోరారు.

ఆర్థిక ఇంబందులతో యువకుడి ఆత్మహత్య..

ముస్తాబాద్, డిసెంబర్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోతుగల్ గ్రామానికి చెందిన కంచం సురేశ్(29) అనే యువకుడు శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై గణేశ్ వివరాల ప్రకారం.. పోతుగల్‌కు చెందిన సురేశ్ ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. సురేశ్ తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కడుపు నొప్పితో వివాహిత ఆత్మహత్య

వేములవాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణానికి చెందిన సోమినేని మౌనిక (30) అనే వివాహిత కడుపునొప్పితో బాధపడుతూ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టణానికి చెందిన మౌనిక కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. మౌనిక తండ్రి తిరుపతి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ ప్రకటనలో తెలిపారు.

ప్రపంచ చెస్ చాంపియన్‌గా

గుకేష్ గెలుపుపై సంబరాలు



సంబరాలు నిర్వహిస్తున్న క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ చదరంగ చాంపియన్‌గా నిలిచిన గుకేష్‌కు అభినందనలు తెలియజేస్తూ జిల్లా కేంద్రంలోని జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం అంబేద్కర్ స్టేడియం ఆవరణలో ఘనంగా సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అకాడమీ క్రీడాకారులు, నగరంలోని క్రీడాకారులు భారీ ర్యాలీ నిర్వహించి, బాణా సంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. అతిథిగా పాల్గొన్న ఒలంపిక్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ చాంపియన్‌గా గుకేష్ గెలవడం భారతదేశానికి గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, పీడీ అంతటి శంకరయ్య, జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ కంకటి అనూప్ కుమార్, జిల్లా డెమోక్రటిక్ చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శులు కంకటి సృజన్‌కుమార్, తాటిపల్లి సతీష్‌బాబు, చదరంగ బాధ్యులు అరుణ్, అనూష్, గౌతమ్, అభి, వెంకటేశ్, పీఈటీలు, చదరంగ క్రీడాకారులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తన కలిగిన వారికి రౌడీషీట్ల నుంచి విముక్తి

- సమీక్షకు డీసీపీ ఆధ్వర్యంలో కమిటీ
- పదేళ్ల క్రితం నమోదైన షీట్లపై పరిశీలన


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా రౌడీషీటర్ల జాబితాలో ఉండి సత్ప్రవర్తన కలిగిన వారికి షీట్ల నుంచి విముక్తి కల్పించాలని ప్రభుత్వం సూచనలు చేసింది. ఈ మేరకు రామగుండం పోలీస్ కమిషరేట్ పరిధిలో సత్ప్రవర్తన కలిగి, ఎలాంటి వివాదాలకు, నేరాలకు పాల్పడకుండా ఉన్న వారిని మానవీయ కోణంతో షీట్లపై సమీక్షించాలని పోలీస్ కమిషనర్ నిర్ణయించారు. పది సంవత్సరాల క్రితం రౌడీషీట్ నమోదై ఇప్పటి వరకు సత్ప్రవర్తన కలిగి ఉండి, ఎలాంటి నేరం చేయకుండా సాధారణ జీవితం గడిపితే వారి షీట్లు తొల గించాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రస్తుత షీట్ల సమీక్షకు డీసీపీ చేతన ఆధ్వర్యంలో ఎస్‌బీ ఏసీపీ, పెద్దపల్లి, గోదావరిఖని ఏసీపీలతో ఒక కమిటీని ఏర్పా టు చేశారు. ఈ కమిటీ రౌడీషీటర్లు, కేడీ, సస్పెక్ట్ తదితర షీట్లపై సమీక్ష చేయనున్నది. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జిల్లాలో పోలీస్ రికార్డుల ప్రకారం 223మంది రౌడీషీటర్లు ఉన్నారు. ఇందులో గోదావరి ఖని వన్‌టౌన్‌లో అత్యధికంగా 59మంది రౌడీషీటర్లు ఉన్నారు. టుటౌన్‌లో నలుగురు, కమాన్‌పూర్‌లో ఇద్దరు, ఎన్‌టీపీసీలో 22, రామగుండంలో 4, మంథని లో 24, రామగిరిలో 12మంది రౌడీషీటర్లు ఉన్నారు. అలాగే పెద్దపల్లి సబ్ డివిజన్ పరిధిలోని పెద్దపల్లి ఠాణా పరిధిలో 14, ధర్మారం 26, బసంత్‌నగర్ 18, సుల్తానాబాద్ 19, పాలకుర్తి 8, కాల్వశ్రీరాంపూర్ 2, జూలపల్లిలో 9షీట్లు ఉన్నాయి. గతంలో తీవ్ర నేరాలు, హత్యలు, హత్యాయత్నాలు, బహిరంగ దాడుల కు పాల్పడడం, బెదిరింపులు, బలవంతపు వసూళ్ల తదితర కేసులను దృష్టిలో ఉంచుకుని రౌడీషీట్లు తెరిచారు. ముఖ్యంగా రామగుండం పారిశ్రామిక ప్రాంతం లో క్రూరమైన హత్యలు, నడిరోడ్డుపై దాడులు, మూకదాడులు, హత్యాచార యత్నాలను పరిగణలోకి తీసుకుని షీట్లు తెరిచారు. గతంలో కొందరు రౌడీషీ టర్లు షీట్లు తెరిచినా కూడా తమ ప్రవర్తన మార్చుకోకుండా ఇప్పటికీ బెదిరింపులు, గొడవలకు పాల్పడడం, కేసులు నమోదు అవడం వంటివి చోటు చేసుకుంటున్నాయి. మరికొందరు షీట్లు నమోదు అయినప్పటి నుంచి నేరాలకు, గొడవలకు దూరంగా ఉంటున్నారు. కొందరు తమపై ఉన్న షీట్లను తొలగించేలా ఉత్తర్వులు తెచ్చుకున్నారు. కొందరు ఏళ్ల తరబడి ఠాణాల చుట్టూ తిరుగుతు న్నారు. ఇందులో 25ఏళ్ల క్రితం రౌడీషీట్లు నమోదు అయిన వారు కూడా ఉన్నా రు. మొత్తంగా నేర ప్రవృత్తికి దీర్ఘకాలంగా దూరంగా ఉన్న రౌడీషీట్లపై రామగుండం పోలీస్ కమిషనర్ పరిశీలన చేస్తుండడంతో రౌడీషీటు ఉన్న సాధారణ జీవితం గడుపుతున్న కుటుంబాల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

మినీ ఏటీఎం కేంద్రాలే టార్గెట్..



- బిర్యానీ, ఫాస్ట్‌ఫుడ్ ఆర్డర్ల పేర టోకరా
- బ్యాంకు సెలవు రోజుల్లోనే మోసాలు
- గోదావరిఖని, పెద్దపల్లిల్లో వరుస ఘటనలు

కోల్‌సిటీ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్కీమ్‌లు, లాటరీలు, బ్యాంకు రుణాల పేరిట మోసాలకు పాల్పడిన సైబర్ నేరస్థులు కొత్త తరహాలో మోసగించేందుకు ఎత్తులు వేస్తున్నారు. ఫోన్లలో స్థానికులుగా పరిచయం చేసుకుంటూ నమ్మబలుకుతున్నారు. స్థానికంగా ప్రముఖులు, వ్యాపారస్తుల పేర్లు చెప్పి మాటల్లోకి దించుతున్నారు. ఇటీవల ఆన్‌లైన్ నగదు బదిలీ కేంద్రాలు, మినీ ఏటీఎంలలో క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డులతో నగదు బదిలీ అవుతుండడాన్ని ఆసరాగా చేసుకుని వాటినే టార్గెట్‌గా చేస్తున్నారు. ఫుడ్ ఆర్డర్ల పేర ఏక కాలంలో రెస్టారెంట్ల నిర్వాహకులు, మినీ ఏటీఎం నిర్వాహకులకు ఒకరికి తెలియకుండా ఒకరికి ఫోన్లు చేసి టోకరా వేస్తున్నారు. నిమిషాల్లోనే మాయచేసి వేలకు వేలు దండుకుంటున్నారు. బ్యాంకుల సెలవు రోజులనే టార్గెట్‌గా చేసుకుని బురిడీ కొట్టిస్తున్నారు. గోదావరిఖని, పెద్దపల్లిల్లో ఈ తరహా వరుస ఘటనలు చోటు చేసుకున్నాయి.

● పది నిమిషాల వ్యవధిలోనే

అదే రోజు పది నిమిషాల వ్యవధిలోనే గోదావరిఖని మెయిన్ రోడ్డులోని ఒక మినీ ఏటీఎం సెంటర్ నిర్వాహకుడికి ఫోన్ చేసిన సైబర్ నేరస్థుడు తాను మార్కండేయ కాలనీలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి ఎండీనని, తనకు పెట్రోల్‌బంక్‌లు, ఇతర వ్యాపారాలు ఉన్నాయని నమ్మబలికాడు. వరుసగా బ్యాంకులకు సెలవులు ఉన్నాయని, అందువల్ల తనకు డబ్బులు బదిలీ చేయాల్సిన అవసరం ఉందన్నాడు. తన ఉద్యోగి వస్తాడని, కమీషన్ తీసుకుని మిగతా డబ్బులు తన అకౌంట్‌లోకి పంపాలని సూచించాడు. అదే సమయంలో మినీ ఏటీఎం దగ్గరే ఉన్న మరో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ యజమానికి ఫోన్ చేసి తనకు కొన్ని పార్సిల్స్ అవసరమని, డబ్బులు పక్కనే ఉన్న మినీ ఏటీఎం నుంచి తీసుకోవాలని అతనికి సూచించాడు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకుడు మినీ ఏటీఎం వద్దకు వెళ్లగా ఏటీఎం నిర్వాహకుడు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకుడిని తనకు ఫోన్ చేసిన ఆసుపత్రి ఎండీ వద్ద పనిచేసే ఉద్యోగిగా భావించాడు. అతడు రావడంతోనే రూ.55వేల సొమ్మును ఆసుపత్రి ఎండీగా చెప్పిన అకౌంట్‌కు బదిలీ చేశాడు. ముందున్న వ్యక్తే తనకు పార్సిళ్ల డబ్బులు ఇవ్వమని ఏటీఎం నిర్వాహకున్ని అడగడంతో అవాక్కయ్యాడు. మోసపోయానని గుర్తించి సైబర్ నేరస్థుడు చేసిన ఫోన్ నంబర్‌కు కాల్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. సైబర్ క్రైమ్ నెం.1930కు ఫోన్ చేసి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

● జిల్లా కేంద్రంలోనూ..

ఇటీవల పెద్దపల్లిలోని ఒక నగదు బదిలీ కేంద్రం నిర్వాహకుడికి ఇదే తరహాలో సైబర్ నేరస్థుడు బురిడీ కొట్టించాడు. తనకు 100బిర్యానీ ప్యాకెట్లు అవసరమని ఫోన్‌లో ఆర్డర్ చేశాడు. అడ్వాన్స్ ఇవ్వాలని బిర్యానీ సెంటర్ నిర్వాహకుడు కోరడంతో భూంనగర్‌లోని మీ సేవ కేంద్రానికి వెళితే రూ.10వేలు ఇస్తాడని, మిగిలిన సొమ్మును తాను ఫోన్‌పే చేస్తానని నమ్మించాడు. అదే సమయంలో ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకుడికి ఫోన్ చేసిన అగంతకుడు తాను ఒకవ్యక్తి ద్వారా నగదు పంపిస్తున్నానని, ఆన్‌లైన్‌లో బదిలీ చేయాలని సూచించాడు. మీసేవ సెంటర్ నిర్వాహకుడు పని మీద బయటకు వెళుతూ షాపులో పని చేస్తున్న వ్యక్తికి తన పేరు చెప్పి ఎవరైనా వస్తే నగదు బదిలీ చేయాలని సూచించాడు. బిర్యానీ సెంటర్ నిర్వాహకుడు మీసేవా కేంద్రానికి వెళ్లి తనకు ఫోన్ చేసిన వ్యక్తికి మరోసారి ఫోన్‌చేసి మీ సేవలో పని చేస్తున్న వ్యక్తికి ఫోన్ ఇచ్చాడు. నేను మీ యజమానితో మాట్లాడాను, నేను చెప్పిన నంబర్లకు డబ్బులు బదిలీ చేయమనడంతో షాపులో పనిచేస్తున్న వ్యక్తి మూడు నంబర్లకు మొత్తం రూ.55వేలు బదిలీ చేశాడు. మీ ముందున్న వ్యక్తి నగదు ఇస్తాడు, తీసు కోండని ఫోన్ కట్ చేశాడు. ముందున్న వ్యక్తిని డబ్బులు ఇవ్వమని అడుగగా తాను బిర్యానీ సెంటర్ నిర్వాహ కుడినని, తాను డబ్బులు ఇవ్వడం ఏంటి? మీ దగ్గర డబ్బులు తీసుకోమని కస్టమర్ చెబితే వచ్చానని తెలు పడంతో మోసపోయామని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

● బిర్యానీ పాయింట్ల పేరుతో..

సైబర్ నేరస్థులు ప్రజల అవసరాలు, నమ్మకాలను ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. మినీ ఏటీఎంలలో ఆర్థిక లావాదేవీలు ఎక్కువగా సాగుతుండడంతో వాటినే లక్ష్యంగా చేసుకుంటున్నారు. అను మానం రాకుండా తెలుగులో మాట్లాడుతూ స్థానికంగా పరిచయం ఎక్కువ ఉన్న వ్యాపారులు, ఆసుపత్రి నిర్వాహకుల పేర్లను వాడుకుంటున్నారు. ముఖ్యంగా బ్యాంకు సెలవు దినాల్లో ఆన్‌లైన్ నగదు బదిలీ సెంటర్లకు గిరాకీ ఎక్కువగా ఉండే అవకాశం ఉండడం, రద్దీ సమయాల్లో నిర్వాహకులను ఏమార్చి బురిడీ కొట్టిస్తున్నారు. గోదావరిఖని మార్కండేయ కాలనీలోని ఒక ప్రముఖ బిర్యానీ సెంటర్ నిర్వాహకులకు రెండు నెలలక్రితం ఫోన్ చేసిన సైబర్ నేరస్థుడు పట్టణానికి చెందిన ఒక కాంట్రాక్టర్‌గా చెప్పుకున్నాడు. తాను చిన్న పార్టీ ఇస్తున్నానని, 55బిర్యానీ పార్సిళ్లు అవసరమని పేర్కొన్నాడు. బ్యాంకు సెలవు దినాలు కనుక నగదు లేదని, సమీపంలోని మినీ ఏటీఎం పేరు చెప్పి అక్కడికి వెళ్లి డబ్బులు తీసుకోవాలని సూచించాడు. సంబంధిత మినీ ఏటీఎంకు ఫోన్ చేసి తాను ఒక మనిషిని పంపుతున్నానని, అతడు నగదు ఇస్తాడని, కమీషన్ ఎక్కువైనా తీసుకుని మిగతా డబ్బులు తన అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేయమని చెప్పాడు. బిర్యానీ సెంటర్ నిర్వాహకుడికి గానీ, మినీ ఏటీఎం నిర్వాహకుడికి గానీ అనుమానం రాకుండా జాగ్రత్త పడ్డాడు.

బిర్యానీ సెంటర్ నిర్వాహకుడు తమకు ఫోన్ చేసిన కాంట్రాక్టర్ ఆర్డర్ తాలుకా డబ్బు లు ఇస్తారని ఆశించి మినీ ఏటీఎం వద్దకు వెళ్లాడు. తనను సదరు కాంట్రాక్టర్ పంపాడని చెప్పడంతో మినీ ఏటీఎం నిర్వాహకుడు తనకు ఫోన్ చేసి నగదు బదిలీ చేయమన్న వ్యక్తి తన మనిషిని డబ్బులు ఇచ్చి పంపాడేమోనని భావించాడు. వచ్చిన వ్యక్తి నుంచి డబ్బులు తీసుకోకుండానే ఫోన్‌లో చెప్పిన వ్యక్తి అకౌంట్‌కు రూ.45వేలు ట్రాన్స్‌ఫర్ చేశాడు. డబ్బులు పంపిన తరువాత తన ముందున్న వ్యక్తికి నగదు ఇవ్వమని అడుగగా అసలు విషయం బయట పడింది. తాను బిర్యానీ సెంటర్ నుంచి వచ్చానని, తనకే ఇక్కడ డబ్బులు ఇస్తారని ఫోన్ చేశారని తెలుపడంతో అసలు మోసం బయట పడింది.

● స్థానిక వ్యాపారుల పేర్లు, వివరాలతో మోసాలు..

సైబర్ నేరస్థులు ఇన్నాళ్లు ఫోన్ నంబర్ల ఆధారంగానే మోసాలకు పాల్పడేవారు. ఇప్పుడు మీసేవా నగదు బదిలీ కేంద్రాలు, ప్రముఖ వ్యాపార సంస్థల వివరాలు గూగుల్ మ్యాప్‌లో అందుబాటులో ఉంటాయి. దీని ఆధారంగా ఆన్‌లైన్‌లో నిర్వాహకుల పేర్లు, వ్యాపార వివరాలను సైబర్ నేరస్థులు సేకరిస్తున్నారు. వీటి ఆధారంగానే సులువుగా మోసాలకు పాల్పడుతున్నారు. నాలుగు రోజుల క్రితం గోదావరిఖనిలోని పలువురు వ్యాపారులకు ఫోన్లు చేసి తాము మున్సిపల్ కార్పొరేషన్ నుంచి మాట్లాడుతున్నామని, ట్రేడ్ లైసెన్స్‌ల సొమ్ము ఏకకాలంలో తాము చెప్పిన నంబర్లకు ఫోన్‌పే ద్వారా పంపాలంటూ ఒత్తిడి చేశారు. దీంతో వ్యాపారులు అప్రమత్తమయ్యారు.

● అప్రమత్తతోనే రక్షణ...

సైబర్ నేరాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే మోసపోకుండా రక్షణ పొందే అవకాశం ఉంటుంది. ఏ చిన్న ఫోన్‌కాల్ విషయంలో ఒకటికి రెండు సార్లు ఆలోచించుకోవాలని సైబర్ క్రైమ్ పోలీసులు సూచిస్తున్నారు.

రోడ్డు పక్కన దేశ నాయకుల ఫొటోలు

- ఆవేదన వ్యక్తం చేస్తున్న ప్రజలు


రోడ్డు పక్కన పడేసిన దేశనాయకుల ఫొటోలు

కొడిమ్యాల, డిసెంబరు13 (ఆంధ్ర జ్యోతి): కొడిమ్యాల నుంచి పూడూర్ వెళ్లేదారిలో రోడ్డు పక్కన శుక్రవారం దేశ నాయకుల ఫొటోలు కనిపించాయి. రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్, జాతిపిత మహా త్మాగాంధీ చిత్రపటాలతో పాటు మరి కొంత మంది మహనీయుల ఫొటోలు రోడ్డు వెంట వెళ్లేవారిని ఆశ్చర్యానికి గురిచేశాయి. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా, రాష్ట్ర నాయకులు కొత్తూరి స్వామి, అధ్యక్షుడు సురుగు శ్రీను మాట్లాడుతూ మహనీయులను అవమాన పరిచే విధంగా ఫొటోలను రోడ్డుపై పడేసిన వారిని గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు.

యాదవ విద్యావంతుల వేదిక జిల్లా కార్యవర్గం


జిల్లా కన్వీనర్ రాజయ్య


కో కన్వీనర్ పోచమల్లు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): యాదవ విద్యావంతుల వేదిక జిల్లా కన్వీనర్, కో కన్వీన ర్లను నియమిస్తూ వేదిక రాష్ట్ర అధ్య క్షుడు చలకాని వెంకట్‌యాదవ్ ప్రకట న జారీ చేశారు. జిల్లా కన్వీనర్‌గా ఆసర రాజయ్య యాదవ్, కోకన్వీన ర్‌గా పోచమల్లు యాదవ్‌ను నియ మించారు. జిల్లాలో యాదవ విద్యావం తుల వేదికను పటిష్ట పరిచే విధంగా కృషిచేయాలని సూచించారు. వీరి నియామకం పట్ల పలువురు వేదిక నా యకులు, యాదవులు హర్షం వ్యక్తం చేశారు.

మహా శివరాత్రి వరకు సౌకర్యాలు కల్పించాలి

- జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

సారంగాపూర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి వరకు భక్తులకు అన్ని సౌకర్యాలు అందుబాటులోకి తీసుక రావాలని జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. సారంగాపూర్ మండలంలోని పెంబట్ల శ్రీ దుబ్బరాజేశ్వర స్వామి దేవాలయాన్ని బీఆర్‌ఎస్ నేతలతో కలిసి శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ ఎంపీగా కవిత గతంలో మంజూరు చేసిన రూ 86 లక్షల నిధులతో చేపట్టిన గోపురం, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఈ పనులు వేగవంతంగా, నాణ్యత ప్రమాణాలు పాటించి పూర్తి చేయించాలని ఆమె తెలిపారు. అలాగే బీర్‌పూర్ లక్ష్మీ నరసింహ స్వామి, జగిత్యాల గుట్ట రాజేశ్వర స్వామి, కొండగట్టు ఆంజనేయ స్వామి దేవాలయాలకు కూడ నిధులు మంజూరు చేసినట్లు ఆమె గుర్తు చేశారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ సారంగపూర్ మండల అధ్యక్షులు తేలు రాజు, సారంగపూర్ పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాగి సత్యంరావు, మండల యూత్ అధ్యక్షులు సిలివేరి మదన్, ఒడ్నాల జగన్, అత్తినేని నరేష్, ఆకుల తిరుపతి, ఎండబెట్ల ప్రసాద్, సాంబారి గంగాధర్, రమేష్, జలందర్, అలీం, వేణు, రవి, బండారి వెంకటేష్, సుమన్‌నాయక్, అరవింద్‌గౌడ్, రవిగౌడ్, శ్రీను, రాజరెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడి పూజా మహోత్సవం


అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

కోరుట్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని తిలక్‌రోడ్డులో అయ్యప్ప పడిపూజ మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. వేదపండితుడు పాలెపు రామకృష్ణ మంత్రోచ్చారణల మధ్య పడిపూజ మహోత్సవాన్ని నిర్వహించారు. కాలనీకి చెందిన రుద్ర వసంత్ కుమార్ కన్నె స్వామి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని జరిపారు. గణపతి, సుబ్రహ్మణ్య, అయ్యప్ప స్వాముల ఉత్సవ మూర్తులకు అభిషేక కార్యక్రమాలను నిర్వహించి ప్రత్యేక పూజలను జరిపారు. వేంకటేశ్వర భజన మండలి గురుస్వామి గట్ల అనంద్ ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలను నిర్వహిచారు. రుద్ర వసంత్ కుమార్ స్వాములకు అన్న ప్రసాదం అందించగా భారీగా స్వాములు పాల్గొన్ని అన్న ప్రసాదాన్ని స్వీకరించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు అంబల్ల శ్రీనివాస్, జుంబర్తి రమేష్, ప్రశాంత్, సాయి, తోట రాజు, గడ్డం మధులతో పాటు పలువురు పాల్గొన్నారు.

వర్గీకరణపై సీఎం స్పందించాలి

- ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు, అంబేద్కర్ సంఘ నాయకులు

కోరుట్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కోరుట్ల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్‌డీఓ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి కార్యాలయ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చౌరస్తాలో మహిళా సోదరీమణులు డప్పు కళాకారులు సిందు మాదిగల ఆధ్వర్యంలో పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ నాయకులు మాట్లాడుతూ 32 సంవత్సరాలుగా పలు పార్టీలు కమీషన్లు, కమిటీలు వేస్తూ వస్తున్నారని ఇప్పటి వరకు ఏ ఒక్క నాయకుడు గానీ పూర్తిస్థాయిలో వర్గీకరణ చేపట్టలేదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో భారతదేశంలోనే మొట్ట మొదటిసారి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఏకగ్రీవంగా తీర్మానం చేసి వర్గీకరణ చేస్తామని వాగ్ధానం చేసారని అన్నారు. ఇప్పుడు ఒక కమిటీ వేశారని కమిటీ కాల యాపన కోసం పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మోర్తాడ్ లక్ష్మీనారాయణ, ఎంఆర్‌పీఎస్ ప్రధాన కార్యదర్శి వనతపుల అంజయ్య, నాయకులు రాజశేఖర్, నారాయణ, ఎర్ర శంకర్, బలవంతుల సురేష్, పేట భాస్కర్, రాజేష్, సీహెచ్ లక్ష్మణ్, శనిగారపు వినోద్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన యువకుడి అరెస్టు

జమ్మికుంట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ యువకుడు శుక్రవారం రాత్రి మహిళలతో అసభ్యంగా ప్రవర్తించాడు. మంచిర్యాలకు చెందిన భోగి అఖిల్ తన బాబాయ్ కుమార్తె ఎంగేజ్‌మెంట్ కోసం జమ్మికుంటకు వచ్చాడు. ఒంటిపై దుస్తులు లేకుండా జమ్మికుంట బస్టాండ్ వద్ద యువతులు, మహిళల వద్దకు వచ్చి వీరంగం సృష్టించాడు. యువకుడి ఆగడాలతో విసుగు చెందిన ప్రయాణికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు యువకుడిని స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు.

● ఆన్‌లైన్ క్లిక్..

పనులు ఎప్పటికి పూర్తయ్యేను...?

నగరం నుంచి నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా చొప్పదండి రోడ్డులో తీగలగుట్టపల్లి వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభమై ఏడాది దాటినా ముందుకు సాగడం లేదు. ఓవైపు పిల్లర్లు వేసి వదిలేయగా మాణికేశ్వరి గుడివైపు స్లాబ్ దశలో నిలిచిపోయి ప్రయాణికులు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. రైలు గేటు పడటంతో పెద్ద సంఖ్యలో వాహనాలు రోడ్డుపై నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, కరీంనగర్


తీగలగుట్టపల్లి వద్ద పిల్లర్ల దశలో నిలిచిపోయిన రైల్వే ఓవర్ బ్రిడ్జి


రైలు గేటు పడడంతో ప్రయాణికుల ఇక్కట్లు


తీగలగుట్టపల్లివైపు ఓవర్ బ్రిడ్జి స్లాబ్ దశలో నిలిచిపోయిన పనులు

16 నుంచి ధనుర్మాసోత్సవాలు



ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి

ధర్మపురి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో సోమవారం నుంచి ధనుర్మాసోత్సవాలు ప్రారంభం అవుతాయని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ఆలయాలు ఉదయం 3 గంటలకు తెరచి ఉంచుతారని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఉదయం 4 గంటల నుంచి 5-30 వరకు స్వామి వారికి నిత్యం అర్చకులు ప్రత్యేక అభిషేకం, స్వామి వారికి తిరుప్పావై ప్రభందం జరుపుతారని తెలిపారు. అనంతరం స్వామి వారికి నైవేద్యం సమర్పిస్తారని పేర్కొన్నారు.

నేషనల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ఖని క్రీడాకారుడికి చోటు



సంతోష్ ట్రోఫీ జట్టుకు ఎంపికైన క్రీడాకారుడు అభిషేక్

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో తెలంగాణ నుంచి గోదావరిఖనికి చెందిన అభిషేక్‌కు జట్టులో చోటు లభించింది. గత ఏప్రిల్‌లో గోదావరిఖనిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో కరీంనగర్ జట్టు 3వ స్థానంలో నిలువగా సీనియర్ నేషనల్ టీమ్ సెలక్షన్‌లో సంతోష్ ట్రోఫీ కోసం నిర్వహించిన ఎంపిక జట్టులో అభిషేక్ తెలంగాణ జట్టు నుంచి ఆడనున్నాడు. ఎంపికైన అభిషేక్‌ను ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రెటరీ గణపతి అభినందించారు.

ఎస్‌యూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

గణేశ్‌నగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమైనట్లు శాతవాహన విశ్వవి ద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగప్రసాద్ తెలిపారు. ఉదయం మొత్తం 12,220 విద్యార్థులు హాజరు కావలసి ఉండగా, 11,205 మంది హాజ రైనట్లు పేర్కొన్నారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగప్రసాద్ తెలిపారు.

'కళ' తప్పిన చిందు యక్షగానం



ప్రదర్శన ఇస్తున్న కళాకారులు (ఫైల్)



ప్రదర్శనలో వేషధారణ (ఫైల్)

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు వీనుల విందైన సంగీతాన్ని అందించిన వారి హార్మోనియం నేడు మూగబోతోంది.. విశేష ఆదరణ పొందిన చిందు యక్షగానం కళతప్పింది. పాశ్చాత్య సంస్కృతి చిందు యక్షగాన కళను కబళిస్తోంది. చిందు యక్ష కళాకారుల ప్రదర్శన ఉందంటే ఊళ్లోని చిన్నా, పెద్దలు భారీ సంఖ్యలో తరలివచ్చేవారు. రామరావణ, శ్రీకృష్ణార్జున యుద్ధం, అల్లీరాణి, చెంచులక్ష్మి, భక్తప్రహ్లాద, సత్యహరిశ్చంద్ర, గుణసుందరికథ, చిరుతల రామాయణం తదితర నాటకాలను రాత్రంతా ఆసక్తిగా చూసే వాళ్లు. ఊళ్లో నాటకం ఉందంటే చుట్టు పక్కల గ్రామాల వారు ఎడ్లబండ్లపై ఉత్సాహంగా తరలివచ్చిన రోజులు ఉన్నాయి. ఆనాడు కళాకారులకు గ్రామస్తులు, గ్రామ పెద్దలు, కుల సంఘాల ఆధ్వర్యంలో కళాకారులకు డబ్బులు, ధాన్యంతోపాటు వస్త్రాలు, కానుకలు ఇచ్చి సత్కరించేవారు. టీవీలు, సినిమాలు రాకతో చిందు యక్షగానకళలతో పాటు వీధి బాగోతాలు, బుర్రకథ, హరికథలు అంతరించే దశలో ఉన్నాయి. ఆదరణ కరువై కళాకారులకు ప్రదర్శనలు లేక జీవనోపాధి కరువైంది. దీంతో కుటుంబ పోషణ కోసం కొందరు కళాకారులు కూలీలుగా మారారు. ఆదరణ లేక ఈ కళను నేర్చుకునేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో చిందు యక్షగానం ప్రాభవం కోల్పోతున్నది.

● చిందు యక్షగానం.

చిందు యక్షగానాన్ని సుమారు 12మంది సభ్యులు రక్తి కట్టిస్తారు. హార్మోనియం, తబలా, తాళాలు ప్రధాన వాయిద్యాలు. ఏ నాటకం వేసినా ఒకరు విలన్, ఒకరు హీరో, ఒకరిద్దరు ఆడవేషాలు, ఒక బుడ్డరఖాన్, సహాయకులు ఒకరిద్దరు, మిగతా వారందరూ వాయిద్య సహకారం, కోరస్ అందిస్తారు. నాటకాన్ని మూడు నుంచి ఐదు రోజుల వరకు వేసేవారు. ఊరందరూ కలిసి వీరిని ప్రతి సంవత్సరం పిలిపించుకొని శుభకార్యాల్లో నాటకాలు వేయించేవారు. భోజనం, విడిది ఏర్పాటు చేసేవారు.

● వారి కోరికలివే...

నెలనెలా ఒక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి కళాకారులను ఆర్థికపరంగా ఆదుకోవాలని, చిందుయక్షగాన యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేయాలని, సంఘ భవనాన్ని నిర్మించి, పింఛన్ ప్రతినెలా అందేలా చూడాలని ప్రభుత్వానికి మొర పెట్టుకుంటున్నారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సందర్భంలోనైనా తమకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

● కరవైన ఉపాధి

చిందు యక్షగాన కళ ప్రదర్శనలు లేక నిరాదరణకు గురవుతున్నది. ప్రదర్శనలు లేకపోవడంతో కళాకారులకు పూట గడవడం కష్టంగా మారింది. అప్పుడప్పుడు ఎవరైనా ప్రదర్శనకు పిలిస్తే వెళ్లి కళకు జీవం పోస్తున్నారు. గతంలో ప్రభుత్వాలు అక్షరాస్యత నిర్మూలన, కుటుంబ నియంత్రణ, సంపూర్ణ పారిశుధ్యం, జన్మభూమి తదితర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చేపట్టిన కార్యక్రమాల ద్వారా కళాకారులకు ఉపాధి కల్పించింది. ఆ తర్వాత ప్రభుత్వాలు పట్టించుకోక నానాటికీ వారి జీవితాలు ఆగమ్యగోచరంగా మారాయి.

● తీగలగుట్టపల్లిలో వంద కుటుంబాలు

కరీంనగర్ మండలం తీగలగుట్టపల్లి గ్రామంలో దాదాపు వంద కుటుంబాలకు పైగా చిందు కుటుంబాలు ఉన్నాయి. గతంలో నాటక ప్రదర్శనతో ఉపాధి పొందిన కళాకారులు ప్రస్తుతం పూట గడవని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఒక వైపు ప్రదర్శనలు లేకపోవడం, మరో వైపు ప్రభుత్వ పథకాల ప్రచారంలో అవ కాశం కల్పించకపోవడంతో కళాకారులు ఇతర వృత్తులను ఆశ్రయించారు. యువకులు ఈ వృత్తిని విడిచి ఉపాధినిచ్చే వృత్తుల్లో స్థిరపడ్డారు. ప్రస్తుతం ఈ గ్రామంలో పదుల సంఖ్యలో మాత్రమే వృద్ధ కళాకారులున్నారు. నలుగురికి తప్ప కొందరికి వృద్ధకళాకారులకిచ్చే పింఛన్ సైతం మంజూరు కాకపోవడంతో ఆర్థికం గా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలువురికి నివాస గృహాలు కూడా లేకపోవడంతో పూరి గుడిసెల్లో జీవితం గడుపుతున్నారు.



2003లో శాతవాహన కళోత్సవాల్లో పాల్గొన్న కళాకారులు (ఫైల్)

● ప్రభుత్వం ఆదుకోవాలి



ఒకప్పుడు యక్షగాన ప్రదర్శనల ద్వారా కుటుంబంలోని అందరికి ఉపాధి దొరికింది. కళాకారులకు, కళకు గౌరవముండేది. ఇప్పుడు ఆదరణ లేకపోవడంతో ఉపాధి కరువయింది. ప్రభుత్వ పథకాల ప్రచార కార్యక్రమాల్లో సైతం అవకాశమివ్వకపోవడంతో ఉపాధిలేక రోడ్డున పడ్డాం. ఆదుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి తగిన చర్యలు చేపట్టాలి.

- గజవెల్లి కిష్టయ్య, చిందు యువజన యక్షగాన కళాకారుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు

● ఆసరాగా నిలవాలి



కళాకారులకు తగిన ప్రాధాన్యం కల్పించి ప్రదర్శనలకు అవకాశం కల్పించి ఆదుకోవాలి. కళాకారులకు పింఛన్ అందజేసి ఆసరాగా నిలవాలి. ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి.

- గడ్డం అంతయ్య, కళాకారుడు

పశుగ్రాసానికి డిమాండ్

- గడ్డి కట్ట ధర రూ. 80
- మెట్ట ప్రాంతానికి తరలిస్తున్న పశుపోషకులు



దమ్మక్కపేటలో పశుగ్రాసాన్ని తీసుకెళ్తున్న రైతులు

హుజూరాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతంలో పశుగ్రాసానికి భలే డిమాండ్ ఉంది. గత ఏడాది యాసంగిలో వరి పంటలు నీళ్ల లేక ఎండిపోయాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని ముందస్తుగానే రైతులు పశుగ్రాసాన్ని నిల్వ చేసుకుంటున్నారు. వరి కోతలు దాదాపుగా పూర్తయ్యాయి. రైతులు తమ పశువుల మేత కోసం గడ్డిని సేకరిస్తున్నారు. కొంత మంది రైతులు గడ్డిని రోలర్ తెప్పించుకొని గడ్డి కట్టలు చుట్టించుకుంటున్నారు. ఒక వరిగడ్డి కట్టకు మెట్ట ప్రాంత రైతులు రూ. 80 చెల్లిస్తున్నారు. మెట్ట ప్రాంతమైన సైదాపూర్, హుస్నాబాద్, భీమదేవరపల్లి, కోహెడ, ఎల్కతుర్తి, జనగామ, స్టేషన్ ఘనపూర్ తదితర ప్రాంతాలకు లారీలు, ట్రాక్టర్లలో తీసుకెళ్తున్నారు. ఈ ప్రాంతంలో ప్రతి ఇంటికి పాడి పశువులు ఉండడంతో ఈ పశుగ్రాసాన్ని సేకరిస్తున్నారు. వేసవిలో పశుగ్రాసం కొరత ఉంటుందనే భయంతోనే ముందుగానే రైతులు జాగ్రత్త పడుతున్నారు. ప్రస్తుతం రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు ఆసక్తి కనబరుస్తుండడంతో పశువుల పేడకు డిమాండ్ ఉంది. దీంతో పశుగ్రాసాన్ని కొనుగోలు చేస్తున్నారు. పశువుల పేడకు ట్రాక్టర్‌కు రూ. 3వేల ధర పలుకుతుండడంతో రైతులకు ప్రయోజనంగా ఉందని చెబుతున్నారు.



సైదాపూర్ మండలం బొమ్మకల్‌లో నిల్వ చేసిన గడ్డి కట్టలు

పరిశోధనలతోనే విప్లవాత్మక మార్పులు

- రైతులు పంటల మార్పిడిపై దృష్టి సారించాలి - జయశంకర్ విశ్వవిద్యాలయ వజ్రోత్సవాల్లో వక్తలు



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు


జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): శాస్త్రవేత్తల పరిశోధనల ఫలాల వల్లనే వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని, క్షేత్రస్థాయి రైతులకు ఇవి అందినప్పుడే సంపూర్ణ అభివృద్ధి సాధ్యం అవుతుందని వక్తలు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. జగిత్యాల రూరల్ మండలం పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఏర్పడి 60ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా పరిశోధన స్థానంలో ముందస్తు వజ్రోత్సవాలు ఏడీఆర్ గాదె శ్రీనివాస్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, అతిథులుగా ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌తో పాటు శాస్త్రవేత్తలు, విద్యార్థులు, రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు సావనీర్‌ను ఆవిష్కరించారు. ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ పొలాస వ్యవసాయ పరిశోధన స్థానానికి రాష్ట్రంలో ప్రత్యేక స్థానం ఉందని, దాని కొనసాగింపునకు మరింతగా కృషిచేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ రైతులు సాంప్రదాయ పంటల సాగు విధానం వైపు వెళ్లకుండా, వాణిజ్య లాభాదాయ పంటల వైపు దృష్టిని మరల్చి అధిక లాభాలు పొందాలని సూచించారు. హైదరాబాద్ శంషాబాద్ వద్ద హైడ్రోఫోనిక్ విధానంతో సుమారు వెయ్యి ఎకరాల్లో కూరగాయలు సాగు చేస్తున్నారని, ఆ విధా నం మన వద్ద కూడా అవలంబిస్తే రైతులకు ఉపయో గకరంగా ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ జగిత్యాల జిల్లా కేంద్రంగా కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వజ్రోత్స వాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఈ సందదర్భగా ప్రశంసాపత్రాలు అందజేశారు.

- ఆకట్టుకున్న స్టాల్స్..

యూనివర్సిటీ వజ్రోత్సవాల వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ రైతులను, అతిథులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రైతులకు అవసరమైన పరికరాలు, పనిముట్లు, వంగడాలను ఈ స్టాల్స్‌లో ప్రదర్శించారు. విత్తన ప్రదర్శన కార్యక్ర మంలో భాగంగా తెలంగాణ ప్రాంతంతో పాటు జిల్లాలో సాగు చేస్తున్న వివిధ వంగడాలతోపాటు, చెరుకు, మొక్కజొన్న, సోయ వంటి ఉత్పత్తులను, వాటి దిగుబడులను అతిథులకు విద్యార్థు లు, శాస్త్రవేత్తలు వివరించారు.

విద్యావంతులకు సాగుపై ఆసక్తి..

- వెల్ముల రాంరెడ్డి, రైతు, పూడూర్



కొందరు విద్యావంతులు సాగుకు ఆసక్తి చూపుతూ, నూతన విధానాలతో రాణిస్తుండడం అభినందనీయం. జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ ఈ యేడాది వజ్రోత్సవాలు నిర్వహించుకోవడం శుభ పరిణామం. 60ఏళ్లలో వ్యవసాయ రంగంలో అభివృద్ధి జరిగిన మాట వాస్తవమే. కొత్త వంగడాలు, యాంత్రీకరణ జరిగింది. కానీ ప్రస్తుత వ్యవసాయంతో బతుకుదెరువు ఉందనే భరోసా లేకుండా పోతోంది. రైతు వారసులు అంతగా వ్యవసాయం వైపు ఆసక్తి చూపడం లేదు.

మార్కెటింగ్ విధానంపై పరిశోధనలు జరగాలి..

- పులి లక్ష్మీపతి, రైతు, బోయినిపెల్లి



వ్యవసాయ పరిశోధన స్థానంతో దశాబ్దాల అనుబంధం ఉంది. ప్రస్తుత యేడాది యూనివర్సిటీ వజ్రోత్సవాలు నిర్వహించుకోవడం ఆనందంగా ఉంది. కానీ నూతన వరి వంగడాలు కనుగొనడం, వాటి ఫలాలను రైతుల చెంతకు చేర్చడంలో జాప్యం జరుగుతున్నది. జాప్యాన్ని నిలువరించే చర్యలు తీసుకోవాలి. ఆంధ్రా వంగడాల మాదిరిగా, తెలంగాణ వంగడాలు పోటీని అధిగమించలేకపోతున్నాయి. రైతు ఆలోచనలు, ఆకాంక్షలతో పాటు వారి అభివృద్ధికి అను గుణంగా పరి శోధనలు జరగాలి. భవిష్యత్తులో పీజేటీఏయూ చర్యలు తీసుకునేందుకు ముందుకు సాగుతుందని ఆశిస్తున్నాం.

వైద్య సేవలపై తనిఖీ బృందం పరిశీలన



సభ్యులకు స్వాగతం పలుకుతున్న వైద్య సిబ్బంది

వీణవంక, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు గ్రామంలోని పీహెచ్‌సీలో అందుతున్న సేవలను పరిశీలించేందుకు శుక్రవారం జాతీయ నాణ్యత పరిశీలన అధికారులు వచ్చారు. ఈ మేరకు డిప్యూటి డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, మెడికల్ ఆఫీసర్ వరుణ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు, ప్రసవాల సంఖ్యను అడిగి తెలుసుకొని వివరాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో జాతీయ నాణ్యత తనిఖీ బృందం సభ్యులు డాక్టర్ శరమ భాను, డాక్టర్ శర్మ, భరత్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ వరుణ, ఎంసీహెచ్ సన జవీరా తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో గురువారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. రాజన్నకు ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

త్యాగరాజ ఉత్సవాలకు దరఖాస్తుల ఆహ్వానం

వేములవాడ కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో 18 జనవరి 2025 నుంచి 22 జనవరి వరకు నిర్వహించనున్న త్యాగరాజస్వామి ఆరాధన ఉత్సవాలకు కళాకారులు దరఖాస్తు చేసుకోవాలని ఆలయ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. ఉత్సవాల్లో సుప్రసిద్ధ కళాకారుల శాస్త్రీయ, సంగీత, జంత్రవాద్య సోలో, హరికథ, నృత్య, నాటక, ఉపన్యాస, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ అమలు చేయాలని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇప్పపూల దేవేందర్, టీటీయూ జిల్లా అధ్యక్షుడు కొండి కోప్పుల రవి, టీఆర్టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్ డిమాం డ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా కమి టీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు శుక్రవారానికి నాలుగో రోజుకు చేరుకున్నాయి. కేజీబీవీ పాఠశాలలకు చెందిన ఎస్‌వోలు, యూ ఆర్‌ఎస్ ఎస్‌వోలు, ఉద్యోగులు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలి పారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సంఘాలకు చెందిన పలువురు మద్దతు తెలిపారు. దీక్షల్లో బుర్ర జలేందర్, జయలక్ష్మీ, నీరజ, వెంకట రమణ, పద్మ, నరేందర్, శ్రీనివాస్, దేవరాజ్, సలీం, వెంకటేష్, శ్యామల పాల్గొన్నారు.



పెద్దపల్లిలో బతుకమ్మ ఆడుతూ నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

పెద్దపల్లి రూరల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏకశిలా పార్కు వద్ద ఇచ్చిన హామీని అమలు చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ చేపడుతున్న సమ్మె శుక్రవారానికి నాలుగో రోజుకు చేరుకుంది. పెద్దపెల్లి దీక్ష శిబిరాన్ని ఉపాధ్యాయ సంఘ నాయకులు. టీటీయూ ప్రెసిడెంట్ రవి కుమార్ జనరల్ సెక్రెటరీ మానసూర్ సీపీఐ జిల్లా సెక్రెట్ తాండ్రా సదానందం ఏఐఎస్ఎఫ్ ప్రెసిడెంట్ మనస కుమార్ మద్దతు ప్రకటించారు శుక్రవారం రోజున మహిళా ఉద్యోగులు బతుకమ్మలు పేర్చి రోడ్డుపై పెట్టి ఆడుతూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు తిప్పని తిరుపతి. కేజీబీవీ రాష్ట్ర నాయకురాలు పుల్లూరి సంధ్యారాణి. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర ముఖ్య సలహాదారు కుంబాల సుధాకర్, రాష్ట్ర నాయకులు తాళ్లపల్లి మల్లన్న, రామగిరి రవిరాజు, కస్తూర్బా బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారులు స్వప్న, విజయలక్ష్మి, కమల, జ్యోతి, స్వప్న, జిల్లా నాయకులు పిల్లి రమేశ్, ఆర్ కృష్ణయ్య, సీఆర్టీలు, పీజీ సీర్టీలు, కోఆర్డినేటర్లు. సీసీవోలు, మెసెంజర్లు 250మంది సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం



ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

భగత్‌నగర్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): లగిచర్ల రైతులకు బేడీలు వేసినందుకు నిరసనగా కమాన్ చౌరస్తాలో బీజేపీ నాయకులు ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ అల్లుడి ఫార్మా కంపెనీని సొంత భూముల్లో ఏర్పా టు చేసుకోకుండా దళిత నిరుపేద గిరిజన రైతుల భూములు లాక్కోవడం ఎందుకో కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలన్నారు. కార్యక్రమంలో దుబాల శ్రీనివాస్, నాంపల్లి శ్రీనివాస్, గుంజేటి శివకుమార్, అవుదుర్తి శ్రీనివాస్, పురం హరిశంకర్, తణుకు సాయికృష్ణ, కలికోట మోహన్, మాచర్ల కోటేష్, పోరెడ్డి శ్రీధర్ పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి వృద్ధుడి ఆత్మహత్య

కరీంనగర్ క్రైమ్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన ఓ వృద్ధుడు అపార్ట్‌మెంట్ భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని కట్టరాంపూర్‌కు చెందిన కుంకుమల్ల శ్రీరాములు(78) తనకుటుంబంతో ఒక అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నాడు. ఐదేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ పలుమార్లు చనిపోతానని కుటుంబసభ్యులతో అంటుండేవాడు. శుక్రవారం ఐదో అంతస్తుకు వెళ్లి అక్కడి నుంచి కిందకు దూకాడు. తలకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

న్యూస్ బాక్స్

ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సమావేశం

ముత్తారం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశంలో శుక్రవారం ఎంపీడీవో సురేష్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎన్నుకున్న కమిటీ సభ్యులతో ఎంపీడీవో సురేష్ మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో నిబద్ధత పాటించాలని, అర్హులకు మాత్రమే ఇళ్లు కేటాయించాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులతో కలిసి సర్వేలో పాల్గొన్నారు.

నాగేపల్లి కొనుగోలు కేంద్రంలో తూకంలో తేడా..

రామగిరి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగేపల్లి గ్రామంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రంలో తూకంలో తేడాలు రావడంతో రైతులు శుక్రవారం ఆందోళనకు దిగారు. ప్రతి ధాన్యం బస్తాలో కిలో తేడా రావడంతో సిబ్బందిని రైతులు నిలదీశారు. గ్రామానికి చెందిన ఓ రైతు తన ధాన్యాన్ని కాంటా వేస్తుండగా అనుమానం వచ్చి అదే సెంటర్‌లో మరో కాంటాలో తూకం వేయడంతో కిలో తేడా గుర్తించాడు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు సెంటర్‌లోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేసే ప్రయత్నం చేశారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రైతులను శాంతింపజేశారు. ఎలక్ట్రికల్ కాంటాలో సాంకేతిక పరమైన ఇబ్బందులు తలెత్తినట్లు ఐకేపీ సిబ్బంది వెల్లడించారు. తమ తప్పిదం లేదని పేర్కొన్నారు. ఎలక్ట్రికల్ కాంటాపై సాంకేతిక పరమైన ఇబ్బందులను సవరించాలని రైతులు డిమాండ్ చేశారు.

వస్తువుల వేలం

మంథని, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రి సూపరింటెండెంట్, కమిటీ నిర్ణయం మేరకు స్థానిక ప్రభుత్వ సామాజిక వైద్యశాలలో ఉపయోగంలోని వస్తువులను, పరికరాలను వేలం వేయనున్నట్లు జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇలాంటి వస్తువుల బిడ్డర్స్‌ను పరిశీలించి సీల్డు కొటేషన్లను ఈనెల 14నుంచి 18వ తేదీవరకు సమర్పించాలని సూచించారు. సీల్డు కొటేషన్లను ఈ నెల 20న హైయెస్టు బిడ్డింగ్ చేసిన వారికి పరికరాలను ఇస్తామన్నారు.

డిగ్రీ విద్యార్థులకు ఉచితంగా ఇంగ్లీష్ నోట్స్ పంపిణీ

సుల్తానాబాద్, డిసెంబరు 13: (ఆంధ్రజ్యోతి): సులభంగా విద్యార్థులకు అర్థమయ్యే విధంగా, పరీక్షలో మంచి మార్కులు సాధించేలా రూపొందించిన ఇంగ్లీష్ నోట్స్‌ను ఉచితంగా విద్యార్థులకు అందజేస్తున్నట్లు హమ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు, సీనియర్ ఆంగ్ల అధ్యాపకుడు ధనపురి సాగర్ తెలిపారు. సుల్తానాబాద్ పట్టణంలోని శ్రీవాణి డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పలువురు విద్యార్థులకు వీటిని ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని ప్రతీ డిగ్రీ పీజీ కాలజీల్లో తమ హమ్ స్వచ్ఛంద సంస్థ ద్వారా విద్యార్థులకు అందజేస్తున్నామని వివరించారు. అయితే తాను వచ్చిన సందర్భంలో అందుబాటులో లేని వారు, దూరప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఎవరున్నా తన సెల్‌ఫోన్ 8885549467 ద్వారా వాట్సాప్ మెసెజ్ చేస్తే వారికి పీడీఎఫ్ రూపంలో పంపిస్తానన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శ్రీవాణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బండారి కమలాకర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం సందర్శన

కమాన్‌పూర్, డిసెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఐకేపీ వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ వేణు శుక్రవారం సందర్శించారు. ఆయన వెంట జిల్లా పౌరసరఫరల శాఖాదికారి రాజేందర్ ఉన్నారు.

లక్షలు వెచ్చించారు.. లక్షణంగా వదిలేశారు..

- ప్రారంభానికి నోచుకోకుండానే శిథిలావస్థకు.. - అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మినీ స్టేడియం - పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



మినీ స్టేడియానికి కేటాయించిన స్థలం



మినీ స్టేడియంలో కిటికీలు, తలుపులు లేని భవనం

సుల్తానాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): లక్షలు వెచ్చించి నిర్మించిన సుల్తానాబాద్ మినీ స్టేడియం ప్రారంభానికి నోచుకోవడం లేదు. సుల్తానాబాద్‌లో క్రీడాభివృద్ధి, క్రీడాకారుల సంక్షేమం కోసం నిర్మించిన మినీ స్టేడియాన్ని పట్టించుకునే వారే కరువయ్యారు. 2005లో ఆనాటి ఎమ్మెల్యే గీట్ల ముకుందరెడ్డి ప్రత్యేక చొరవతో మినీ స్టేడియం మంజూరైంది. సర్వే నంబర్ 779లో 4 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన మినీ స్టేడియం నిరాదరణకు గురై ప్రారంభోత్సవానికి నోచుకోకుండానే శిథిలావస్థకు చేరింది. మొదట రూ.11 లక్షలు, తర్వాత 10 లక్షలు మొత్తం 21 లక్షల రూపాయలు వెచ్చించి ఈ మినీ స్టేడియాన్ని నిర్మించారు. కానీ పూర్తిస్థాయిలో ప్రహరీ మాత్రం నిర్మించలేదు. అయినా ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించింది. ఆ తర్వాత పట్టించుకునే వారు లేకపోవడంతో స్టేడియంలో భవన సముదాయం గదుల కిటికీలు, తలుపులు దొంగలు ఎత్తుకెళ్లారు. ఆకతాయిలు ట్యాంకు, ఇతర పరికరాలు, శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. క్రీడాకారులతో కళకళలాడాల్సిన మినీ స్టేడియం మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మినీ స్టేడియం వినియోగంలోకి వచ్చేలా తగిన చర్యలు చేపట్టాలని క్రీడాకారులు, మండల ప్రజలు కోరుతున్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



సుల్తానాబాద్‌లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సుల్తానాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని 51 మంది కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ చైర్మన్ గాజుల లక్ష్మీ రాజమల్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, వైస్ చైర్ పర్సన్ బిరుదు సమత క్రిష్ణతహసిల్దార్ మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● పెద్దపల్లిటౌన్ (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆర్‌కే గార్డెన్స్‌లో శుక్రవారం సీఎం ఆర్ఎఫ్, కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు లబ్ధిదారులకు అందజేశారు. పెద్దపల్లి మండలం, పట్టణానికి సంబంధించిన కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ లబ్ధిదారులకు 72 లక్షల ఒక వెయ్యి 52 రూపాయల విలువ గల చెక్కులను అలాగే 604 మంది లబ్ధిదారులకు కోటి 54లక్షల రూపాయల విలువగల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్దపల్లి తహసీల్దార్, మార్కెట్ కమిటీ చైర్మన్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ విజేతలకు బహుమతుల ప్రదానం

రామగిరి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో గత రెండు రోజులుగా కొనసాగిన క్రీడాపోటీలు శుక్రవారం ముగిశాయి. ముఖ్యఅతిథిగా ఎంపీడీవో శైలజారాణి హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. వాలీబాల్ జూనియర్ విభాగంలో బేగంపేట్, రన్నర్స్‌గా పన్నూరు, వాలీబాల్ జూనియర్స్(బాలిక) విన్నర్స్ బేగంపేట్, రన్నర్స్ కల్వచర్ల, కబడ్డీ సీనియర్స్ విభాగంలో పన్నూర్ విన్నర్, రన్నర్స్ బేగంపేట్, ఖోఖో సినియర్స్ విభాగంలో పన్నూర్ విన్నర్స్‌గా నిలిచింది, కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీడీవో శైలజారాణి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జేఎన్టీయూ ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి, ఎంపీవో ఉమేశ్, పీఈటీ, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఎలిగేడు (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లోని యువతీయువకుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించాలని ఎంపీడీవో భాస్కర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో శుక్రవారం తెలంగాణ ప్రజాపాలనలో భాగంగా సీఎం కప్ మండలస్థాయి క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. మండలంలోని పలు గ్రామాల యువతీయువకులు, విద్యార్థులు కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నారు. గ్రామస్థాయిలో ఉన్న యువతీయువకులను క్రీడల్లో ప్రోత్సహించాలని ఉద్దేశంతో ఈ క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కబడ్డీ బాలుర విభాగంలో ఎలిగేడు, బాలికల విభాగంలో ధూళికట్ట గెలుపొందారు. ద్వితీయ స్థానంలో బాలుర విభాగంలో ధూళికట్ట, బాలికల విభాగంలో ఎలిగేడు సాధించారు. ద్వితీయస్థానంలో సుల్తాన్‌పూర్ విజయం సాధించింది. క్రీడల ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మండల స్పెషల్ ఆఫీసర్ రమేష్‌నాయక్, పాల్గొని సీఎం కప్ ప్రశాంతంగా నిర్వహించిన ఎంపీడీవో, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో నరేంద్రచారి, స్కూల్ కాంప్లెక్స్ గండ్ర దేవేందర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ధూళికట్ట పీడీ శ్రీకాంత్, మండల ఎస్‌జీఎఫ్ కన్వీనర్ పీడీ ప్రణయ్‌కుమార్ క్రీడలను నిర్వహించారు. గెలుపొందిన జట్లకు స్పెషల్ ఆఫీసర్ రమేష్‌నాయక్, ఎంపీడీఓ భాస్కర్‌రావు, ఎంఈవో నరేంద్రచారి, హెచ్ఎం గండ్ర దేవేందర్‌రావు బహుమతులను ప్రదానం చేశారు.



జేఎన్‌టీయూలో క్రీడాపోటీల విజేతలతో ఎంపీడీవో శైలజారాణి తదితరులు

యాసంగిలోనూ సన్నాల సాగు

(5వ పేజీ తరువాయి)

వేస్తున్నారు. గడిచిన వానాకాలంలో సీజన్‌లో రాష్ట్రంలో ఆశించిన మేరకు వర్షాలు పడడంతో ప్రాజెక్టులన్నీ కళకళలాడుతున్నాయి. జిల్లా రైతులకు వరప్రదాయిని అయిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులు పూర్తిస్థాయి నీటి మట్టంతో ఉన్నాయి. ఎస్సారెస్పీలో 80.5టీఎంసీల నీళ్లు ఉన్నాయి. దీంతో యాసంగి పంటల సాగుకు నీటికి ఢోకా లేకుండా పోయింది. నీటి పారుదల శాఖాధికారులు ఆన్‌అండ్‌ఆఫ్ పద్ధతిలో నీటిని విడుదల చేయనుండడంతో రైతులు ముందస్తుగానే వ్యవసాయ బావుల కింద వరి నార్లు పోశారు. ఈ నెలాఖరు నుంచి వరి నాట్లు మొదలు కానున్నాయి.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మార్కండేయకాలనీ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని సబ్ డివిజన్ పరిధిలోని 33/11కేవీ పీజీ సెంటర్, రాంనగర్, అల్లూరు సబ్ స్టేషన్‌లలో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9.30గంటల నుంచి 10.30గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ అడిచర్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

వరి బదులు ఆయిల్‌పామ్ సాగు చేయాలి

ఎలిగేడు, డిసెంబర్ 13 (ఆంధ్రజ్యోతి) : వరికి ప్రత్యమ్నాయంగా ఆయిల్ పామ్ మొక్కలు నాటుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి ఉమాపతి అన్నారు. మండలంలోని లాలపల్లి గ్రామ రైతులకు ఆయిల్‌పామ్ పంటల సాగు, వాటి ద్వారా వచ్చే లాభాలపై రైతులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులకు ఇచ్చే సబ్సీడీపై వివరించారు. మండలంలోని పలుగ్రామాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు గణనీయంగా పెంచుతున్నారని గుర్తుచేశారు. లాలపల్లి గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం కొప్పర రాంరెడ్డి 2.20, కొప్పర లక్ష్మీ రాజమ్మ 2.20, కొప్పర రాజేశ్వర్‌రెడ్డి 2.30, కొప్పర స్వప్న 1.00, వేల్పుల కొంరయ్య ఎకరం, మొత్తం 9ఎకరాల్లో 513మొక్కలు నాటారని ఏవో తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

తారుపల్లి విద్యార్థులకు టీషర్టుల వితరణ



విద్యార్థులకు టీషర్టులు అందజేసిన ఉపాధ్యాయుడు చంద్రమోహన్

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తారుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని విద్యార్థులకు శుక్రవారం టీషర్టుల వితరణ కార్యక్రమం జరిగింది. ఇదే పాఠశాలలో 12సంవత్సరాలు ఉపాధ్యాయుడిగా పనిచేసిన గత బదిలీల్లో భాగంగా ఓదెల మండలం గుంపుల పాఠశాలకు బదిలీపై వెళ్లిన పైడిపల్లి చంద్రమోహన్ విద్యార్థులకు టీషర్టులను అందజేశారు. చంద్రమోహన్‌తో పాటు బదిలీపై వెళ్లిన కరుణ, రాజులకు పాఠశాలలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు సేవలు ఎంతో ప్రశంసనీయమని, ఉద్యోగ జీవితంలో బదిలీలు సహజమైనప్పటికీ విద్యార్థులకు టీషర్టులను అందజేసిన చంద్ర మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఆగయ్య, సత్యప్రకాష్, రమాదేవి, స్వరూప, రాజమౌళి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో బోర్‌వెల్ సౌకర్యం

కాల్వశ్రీరాంపూర్, డిసెంబర్ 13,(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉషన్నపల్లె గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తాగునీరు కోసం మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే పాఠశాల ఆవరణలో శుక్రవారం బోర్‌వెల్ వేయించినట్లు సారయ్యగౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మహేష్, పాఠశాల చైర్మన్ పెల్లి స్వరూప, ఉపాధ్యాయులు హెచ్ఎం, ఈర్ల సమ్మయ్య, అమృత, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం, అభివృద్ధికి కృషి..



ప్రమాణ స్వీకారం చేస్తున్న చైర్మన్, డైరెక్టర్లు

సుల్తానాబాద్, డిసెంబరు 13:(ఆంధ్రజ్యోతి): రైతులు ఇబ్బందులు పడకుండా వారికి ప్రతీ సీజన్‌లో అండగా ఉంటూ వారి సంక్షేమానికి అభివృద్ధికి పాటుపడతామని సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు అన్నారు. స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఇటీవల నూతనంగా నియామకమైన మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. చైర్మన్‌గా మినుపాల ప్రకాష్‌రావుతో పాటు డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం చైర్మన్ ప్రకాష్‌రావు మాట్లాడుతూ రైతులు వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలని, తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులు సాధించాలన్నారు. తమకు రైతుల సేవ అవకాశాన్ని అందించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుకు, ఎమ్మెల్యే విజయరమణారావుకు చైర్మన్‌తో పాటు పాలకవర్గం కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు, కార్యదర్శి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాలకు లయన్స్ క్లబ్ ఆర్థిక సహాయం

ధర్మారం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మేడారం గ్రామానికి చెందిన ఓ నిరుపేద కుటుంబానికి లయన్స్ క్లబ్ ఆర్థిక సాయం అందించింది. గ్రామంలోని నిరుపేద వృద్ధులకు దుప్పట్ల పంపిణీ చేసింది. గ్రామానికి చెందిన కొనరి రవి-సంధ్యల కుమారుడైన రాజేందర్‌కు వీపులో కణితితో ఇబ్బందిపడుతున్నాడు. శనివారం నిమ్స్ హాస్పిటల్‌లో రాజేందర్‌కు ఆపరేషన్ జరగనుండగా ఖర్చుల నిమిత్తం లయన్స్ క్లబ్ 16500 రూపాయల ఆర్థిక సాయం అందించారు. దీనికితోడు గ్రామంలోని నిరుపేదలైన 20 మంది వృద్ధులకు దాదాపు 5 వేల విలువగల దుప్పట్లను క్లబ్ సభ్యులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు తలమక్కి రవీందర్ శెట్టి, ముజాహిద్, కట్ట రమేష్, నర్సింగం తదితరులు పాల్గొన్నారు.

రామగుండం హైస్కూల్‌ను తనిఖీ చేసిన కలెక్టర్



రామగుండం హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

అంతర్గాం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రామగుండం పట్టణంలోని 21వ డివిజన్ ఏరియాలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించి మాట్లాడారు. మధ్యాహ్నం భోజనంలో భాగంగా విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆదేశించారు. జిల్లా విద్యాధికారి మాధవి, మండల విద్యాధికారి చంద్రయ్య పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద, అపర్ణ పాల్గొన్నారు.

● రామగిరి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రంలో కస్తుర్బా పాఠశాలలో శుక్రవారం అదనపు కలెక్టర్ వేణు ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. పిల్లలకు అందించే భోజనాలు, మోనూను పరిశీలించారు. ఈ తనిఖీలో ఎంపీడీవో శైలజ, తహసీల్దార్ బోర్కర్ రాంచందర్‌రావు, ఎంపీవో ఉమేష్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాలి



పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తున్న అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బొగ్గు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గిస్తూ వార్షిక లక్ష్యాన్ని సాధించాలని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం ఓసీపీ-1లో మల్టీడిపార్ట్‌మెంటల్ సమావేశం జరిగింది. ఈకార్యక్రమానికి జీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రాజెక్టుకు కేటాయించిన లక్ష్యాన్ని సాధించేలా ఉద్యోగులు కృషి చేయాలని సూచించారు. పని గంటలు, యంత్రాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఉత్పత్తి సాధించ గలమని అభిప్రాయపడ్డారు. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవడం, నాణ్యతా ప్రమాణాలు పాటించడం, అంకితభావంతో పనిచేయడం ద్వారా అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చని జీఎం సుధాకర్‌రావు అన్నారు. ఉత్పత్తి ప్రక్రియలో రక్షణది కీలకప్రాతని, ప్రమాదాలు లేని ఉత్పత్తి సాధించాల్సిన అవసరం ఉన్నదని జీఎం అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఈసందర్భంగా సింగరేణి స్థితి గతులు, భవిష్యత్తు ప్రణాళికలు, వెల్ఫేర్ కార్యక్రమాలపై అధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం రక్షణ, యంత్రాల వినియోగం, ఉత్పత్తి పెరుగుదల, రక్షణ అంశాల్లో ఉద్యోగుల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల నాయకులు వైవీ రావు, తిరుపతి రావు, వెంకట స్వామితో నాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

గనులపై ఘనంగా రక్షణ పక్షోత్సవాలు



రక్షణపై నాటిక ప్రదర్శిస్తున్న ఓసీపీ-3 ఉద్యోగులు



పక్షోత్సవాల్లో పాల్గొన్న తనిఖీ బృందం అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియాలోని ఓసీపీ-3 ప్రాజెక్టు, వీటీసీ శిక్షణా కేంద్రాల్లో శుక్రవారం రక్షణ పక్షోత్సవాలు జరిగాయి. ఓసీపీ-3లో ప్రోగ్రాం కన్వీనర్ బైద్యా (జీఎం ఎక్స్‌ప్లోసివ్స్) ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రక్షణ సూత్రాలు పాటించడం వలన మాత్రమే మెరుగైన ఉత్పత్తి సాధించగలమని అన్నారు. చేసేపనిలో చిన్నపాటి నిర్లక్ష్యం ప్రమాదానికి దారి తీస్తుందని, విధి నిర్వహణలో రక్షణ సూత్రాలు పాటించడం, అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. ఈసందర్భంగా ఉద్యోగులు రక్షణపై ప్రదర్శించిన నాటిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభకనబర్చిన ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఆర్జీ-2 జీఎం వెంకటయ్య, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జీ రవీందర్, సీఎంఓఏఐ ప్రతినిధి నరస్సింహులుతో పాటు తనిఖీ బృందం సభ్యులు, ఆర్జీ-2అధికారులు పాల్గొన్నారు.

ఎంవీటీసీలో ఆర్జీ-2 జీఎం వెంకటయ్య, కొత్తగూడెం ఏరియా ఎస్వోటూ జీఎం కోటిరెడ్డిలు హాజరయ్యారు. ఎంవీటీసీలు అంటే గనుల్లో ఉద్యోగులు నిబంధనల మేరకు నడుచుకునేలా శిక్షణ ఇచ్చే కీలకమైనవని, శిక్షణ పొందిన ఉద్యోగులు శిక్షణా సమయంలో తెలుసుకున్న అంశాలను పని స్థలాల్లో పాటిస్తే ఉత్పత్తి, రక్షణ పరంగా మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో అధికారులు నరసింహారావు, ఎస్వోటూ జీఎం రాముడు, అధికారులు సంతోష్‌కుమార్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

● రామగిరి (ఆంధ్రజ్యోతి) : సింగరేణిలో ఏఎల్‌పీ ప్రాజెక్టులో భద్రతా పక్షోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టును భద్రతా బృందం కన్వీనర్ హబీబ్ హుస్సేన్, సభ్యులు చింతల శ్రీనివాస్‌లు ఉత్పత్తి, రక్షణ అంశాలపై పని స్థలాల్లో తనిఖీలు నిర్వహించారు. అనంతరం ప్రాజెక్టు ఆవరణలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గని అధికారులు వివరించారు. ప్రాజెక్టు అధికారి నాగేశ్వర్‌రావు, ఎస్వోటూ జీఎం బండి సత్యనారాయణ, అధికారులు యాదయ్య, రఘురాం, జనార్ధన్, రమేశ్, భద్రతా కమిటీ సభ్యులు కనకయ్య, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

గోదావరిఖని, డిసెంబర్ 13 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించాలని ఆర్‌జీ-1 ఎస్‌ఓటూ జీఎం గోపాల్‌సింగ్, డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు అన్నారు. శుక్రవారం స్థానిక జీఎం కార్యాలయంలో సమావేశ మందిరంలో వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, డ్యాన్స్‌మాస్టర్స్ సేవా సభ్యులతో మాట్లాడారు. స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఆవిర్భావ వేడుకలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సేవా కార్యదర్శి శిరీష, జాయింట్ సెక్రెటరీ బీనసింగ్, కోఆర్డినేటర్ మేడి తిరుపతి, సేవ సభ్యులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ సర్వేకు సర్వం సిద్ధం : ఎంపీడీవో

సుల్తానాబాద్, డిసెంబరు 13: (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు సర్వం సిద్ధం చేశామని ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీవోతో కలిసి గ్రామాల స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల వారీగా సర్వే ప్రారంభించాలని, నిబంధనల మేరకు లబ్ధిదారుల పరిస్థితిని నమోదు చేయాలని సూచించారు. మండలంలో 11వేల 700మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారని వీరిలో అర్హులను ఎంపిక చేయాలన్నారు. ముందస్తుగా నిరుపేదలను గుర్తించాలని, స్వంత జాగ ఉన్నవారిని సైతం గుర్తించాలని సూచించారు.

● కమాన్‌పూర్ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు సహకరించాలని ఎంపీడీవో జి. లలిత అన్నారు. శుక్రవారం మండలంలో ఇందిరమ్మ గృహాల సర్వే ప్రారంభించారు. ఎంపీవో కాటం భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు రాజ్‌కుమార్, రామ్మోహన్, జంజర్ల అమల, అమీనుభాను తదితరులు ఉన్నారు.

నేడు గుండె వ్యాధుల వైద్య పరీక్షల శిబిరం

ఓదెల డిసెంబర్ 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని వివేకానంద విద్యాలయంలో శనివారం గుండె జబ్బుల నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీటీసీ బోడకుంట శంకర్ తెలిపారు. ఉదయం 10 గంటలకు నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని తెలిపారు. ఇందులో లయన్స్ క్లబ్ విజన్ కేర్ వ్యవస్థాపకుడు పూదరి దత్తగౌడ్ సహకారంతో నిర్వహించే ఈ వైద్య శిబిరంలో బీపీ, గుండె, షుగర్, ఈసీజీ, టు డి తదితర వైద్య పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామస్తులు వైద్య పరీక్షల శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌కు డాక్టరేట్

ముత్తారం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్యాపూర్ పంచాయతీ శివారులోని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కు ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పొందారు. సంతోష్ కుమార్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఆంగ్ల విభాగంలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్‌పై ప్రొఫెసర్ కొండ నాగేశ్వర్‌రావు పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. వైస్ ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్

కమాన్‌పూర్, డిసెంబర్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రొంపికుంట ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు వేగోళం సత్యనారాయణ తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.